క్లుప్తంగా

వైద్య నిర్ధారణ పరీక్షలకు విశేష స్పందన



వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఏంజెల్, డాక్టర్ అరుణ్‌తేజ్

తెనాలి అర్బన్: ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ రోడ్డులోని హ్యాపీ హాస్పిటల్‌లో శుక్రవారం ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఏంజెల్, డాక్టర్ అరుణ్‌తేజ్ పలువురుకి వినికిడి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హ్యాపీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావని ప్రియాంక, రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి కార్యదర్శి భానుమతి పాల్గొన్నారు.

కళాకారుడు శ్రీనివాసరావుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం భాగ్యరేఖ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు గొల్లపూడి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెమ్మసాని పోతురాజు, రామావత్ శ్రీనివాస్ నాయక్, దాసరి నరసయ్య, వినుకొండ శ్రీరామమూర్తి, గొల్లపూడి నాగపృధ్వి, దీపాల సాయిసుబ్రహ్మణ్యం, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, సోమవరపు సాంబశివరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, దేవిశెట్టి కృష్ణారావు, కన్నెగంటి మధు, మండేయేబు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు ఘంటసాల సంగీత విభావరి

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీకళారంజని సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన గానగంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత విభావరిని నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 19న నిర్వహించిన కార్యక్రమానికి కొనసాగింపుగా 'ఘంటసాల సంగీత విభావరి–2'ను జరుగుతుందని సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కేవీఎల్ పద్మావతీదేవి, కార్యదర్శి గోనుగుంట్ల మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటల ప్రేమికులుగా ఆశేష ప్రజాదరణ పొందిన వై.ఆర్.శాస్త్రి (హైదరాబాద్) పాల్గొనే సంగీత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

షిరిడి సాయి వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి టౌన్: పట్టణ గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో శుక్రవారం వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. యోగ సభ్యులు పట్టిల రత్తయ్య జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొలవరం మాజీ సర్పంచి గంపల శివనాగేశ్వరరావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగ సభ్యులు తల్లిదండ్రుల పుట్టిన రోజు, పెళ్లిరోజు, జ్ఞాపకార్థం రోజుల్లో వృద్ధులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, సావిత్రి, సామ్రాజ్యం పాల్గొన్నారు.

నేడు ధర్మసత్రం పాత కలప వేలం

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని శ్రీకాకుమాను శంకరుని ధర్మసత్రానికి చెందిన పాత కలప శనివారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సత్రం కార్యనిర్వహణాధికారి మండెపూడి పానకాలరావు, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు కె.శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్రం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు దేవాదాయ అధికారుల సమక్షంలో జరిగే వేలంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చని కోరారు.

నేడు జేసీ పర్యటన

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు శనివారం పరిశీలించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లే–అవుట్లలో గృహ నిర్మాణాల పురోగతిని సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

భట్టిప్రోలు: భట్టిప్రోలు సచివాలయంలో శుక్రవారం 'బేటీ బచావో–బేటీ పడావో' అవగాహన సమావేశం జరిగింది. హెల్త్ విజిటర్ కల్యాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక సర్పంచ్ దారా రవికిరణ్మయి పాల్గొన్నారు. సచివాలయం–2 పరిధిలో సిద్దార్థ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీ బచావో–బేటీ పడావో పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఈ సమావేశాలలో సీహెచ్‌ఓ డి.మాతయ్య, హైస్కూల్ ప్రిన్సిపాల్ వి.భారతి, కరస్పాండెంట్ వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

షాదీఖానాకు నిధుల హామీపై ముస్లింల హర్షం



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముస్లిం పెద్దలు

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల తెనాలిలో నిర్వహించిన భారీ బహిరంగ సభావేదికపై పట్టణంలో ముస్లింలకు షాదీఖానా నిర్మాణానికి రూ.4 కోట్లను కేటాయిస్తున్నట్లు చేసిన ప్రకటనకు హర్షం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవ తీసుకుని షాదీఖానా ఆవశ్యకతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లటం, అదే సభలో సీఎం నిధులు కేటాయిస్తున్నట్లు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనితో శుక్రవారం పలువురు ముస్లింలు స్థానిక ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ రియాజ్‌ఖాన్, జేబీ జిలాని, గోల్డ్ రహిమా, ముఫ్తి రియాజ్, ముఫ్తి హైదర్‌అలీ, మౌలాబి, షేక్ మీరావలి ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



దాతలు అందించిన సింహ, పెద్ద శేష వాహనాలు

చెరుకుపల్లి: మండలంలోని గూడవల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా స్వామిని పెండ్లి కుమారుని చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో జంజనం సాంబశివరావు మాట్లాడుతూ గూడవల్లి గ్రామానికి చెందిన ప్రవాసభారతీయులు వాడపల్లి సీతారామ చంద్రమూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య ఇంద్రాదేవి రూ.1.20లక్షలతో పెద్ద శేషవాహనాన్ని, స్వామివారి దేవాలయంలో అనువంశ అర్చకులు బృందావనం వంశీయులు రూ.70 వేలు విలువ చేసే సింహవాహనాన్ని బహూకరించినట్లు తెలిపారు.

పెదపులివర్రులో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



శ్రీ వరదరాజస్వామి వారు



శ్రీ భూనీళా అమ్మవారు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన శ్రీ భూ నీళా సమేత శ్రీ వరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారిని పెండ్లి కుమారుడిని చేసి, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సహస్ర దీపారాధన, ఋత్విక్‌కరణం, రక్షా బంధనం, వేదిని పూజ, అంకురారోపణ, వాస్తు పూజా హోమం, ధ్వజపట ప్రతిష్ఠ శాస్త్రయుక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణం పంచాహ్నికంగా, వైభవంగా ఫాల్గుణ పౌర్ణమికి జరగనున్నది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నెల 9న వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివరావు తెలిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కంఠంనేని హరిప్రసాద్, సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం సోమవారం శ్రీవారి కల్యాణోత్సవం, గరుడోత్సవం, మంగళవారం రథోత్సవం జరగనున్నాయి.

స్వయంగా రైతులే విత్తనాలను తయారు చేసుకోవచ్చు

బాపట్ల రైతు శిక్షణ కేంద్రం డీడీఏ విజయనిర్మల



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారులు

పిట్టలవానిపాలెం: రైతులు తమకు అవసరమైన విత్తనాలను తామే తయారు చేసుకోవచ్చని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం డీడీఏ విజయనిర్మల తెలిపారు. మండలంలోని పోతనకట్టవారిపాలెంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం, గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు రకాల సూచనలు చేశారు. రైతులు వరి విత్తనాలను తామే తయారు చేసుకోవచ్చని తెలిపారు. కేళీలు లేకుండా వరి మడిలోనే శుభ్రం చేసుకోవాలని సూచించారు. నూర్పిడిని వేరుగా చేసి, తేమ తగలని ప్రదేశంలో బస్తాలను నిల్వ చేసుకోవాలని చెప్పారు. నిల్వ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు అవసరమైన విషయాలను సలహా మండలిలో తెలియజేయాలని సూచించారు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యం క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సాంబశివరావు, ఉమామహేశ్వరి, బాపట్ల ఏడీఏ లక్ష్మి, మండల వ్యవసాయాధికారి సత్యానంద్, వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు జాన్‌రాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి ఆలయ మహోత్సవాలు



స్వామిని దర్శించుకొన్న వేమూరు సీఐ వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివార్లకు బిందె తీర్థం, అభిషేకం, నిత్యావపోసన, బలిహరణ పూజలు జరిగాయి. వేమూరు సీఐ కె.వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈఓ దీవి వెంకట అప్పలాచార్యులు, అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వంశ పారంపర్య ధర్మకర్తలు కొడాలి పానకాలరావు, రామశాస్త్రి, శంకరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రాత్రి శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర భక్త భజన సమాజం ఆర్గనైజర్ కొలుసు నాగమ్మ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. రాత్రి స్వామివార్లకు పుష్ప సేవ నిర్వహించారు.

అంగరంగ వైభవంగా కలశ ప్రతిష్ట మహోత్సవాలు



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వేద మంత్రాల నడుమ మేళతాళాలతో ప్రధాన ప్రాకార గోపుర దివ్య కలశ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. తొలుత కలశాలకు క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మేళతాళాలతో క్రేన్ సహాయంతో గోపురంపై భాగానికి చేర్చారు. ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ద్వారపాలకుల విగ్రహాలు, గరుడాళ్వార్, ఆంజనేయస్వామి విగ్రహాల్ని ఆవిష్కరించి, స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆశీర్వచనం చేశారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య సత్కరించారు. శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా నిత్య పూజలతో పాటు శ్రీ వెంకటేశ్వర మహామంత్ర హోమం నిర్వహించారు. ఆలయ ఉపాధ్యక్షుడు లంక విజయబాబు ఆధ్వర్యంలో పద్మావతి గోదా సమేత శ్రీనివాసుని నగరోత్సవాన్ని శేష వాహనంపై తిరువీధుల్లో కన్నుల పండువగా చేశారు. బ్రహ్మోత్సవ విశేషాల్ని మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, వూటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, అచ్యుతరామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

తొమ్మిది మొబైల్ ఫోన్లు అప్పగింత

నగరంపాలెం: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గుంటూరు పోలీస్ వాట్సాప్ నంబర్ నిరంతరం అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లాలోని మరో తొమ్మిది మందికి పోగొట్టుకున్న ఫోన్లను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్ల కిందట పోయిన ఫోన్లను కూడా అప్పగించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వాట్సాప్ 8688831574 నంబర్‌ను బాధితులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఫోన్లను గుర్తించడంలో ప్రతిభ చాటుతున్న ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్ఐ డి.వెంకటకృష్ణ, కానిస్టేబుళ్లు రమేష్, కరీముల్లా, శ్రీధర్‌ను అభినందించి ప్రశంస పత్రాల్ని అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (పరిపాలన) కె. సుప్రజ, ఎస్బీ సీఐ బి.నరసింహారావు పాల్గొన్నారు.

బాపట్ల ఏరియా వైద్యశాలలో వైద్య విద్యార్థులు

బాపట్ల: బాపట్ల ఏరియా వైద్యశాలలో 12 మంది పీజీ వైద్యులు మూడు నెలల పాటు ప్రజలకు మరిన్ని వైద్య సేవలందించనున్నారు. గుంటూరు ఎన్నారై, కాటూరి వైద్యశాలల నుంచి 12 మంది పీజీ వైద్య విద్యార్థుల బృందం శుక్రవారం బాపట్లకు చేరింది. వీరందరూ మూడు నెలలు పాటు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి, అన్ని వైద్య సేవలను అందిస్తారని, వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ సిద్దార్థ తెలిపారు.

7న ప్రత్యేక పూజా కార్యక్రమాలు

భట్టిప్రోలు: మండలంలోని పెదపులివర్రులోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 7న పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక విష్ణు సహస్ర నామ, సహస్ర దీపోత్సవం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ అఖిలాండకోటి అఖండ జ్యోతి నిర్వాహకులు శ్రీ రామ్‌జీ గురువు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గత నెల 9 నుంచి జరుగుతున్న సప్త సప్తాహములు ఈ నెల 31న పూర్ణాహుతితో ముగుస్తుందని పేర్కొన్నారు.

కుక్కల దాడిలో పది గొర్రెలు మృతి

ఆళ్లమూడి(భట్టిప్రోలు): కుక్కలు దాడి చేసి, పది గొర్రెలను పొట్టనపెట్టుకున్నాయి. మండలంలోని ఆళ్లమూడి గ్రామానికి చెందిన నీలా రాఘవులు గొర్రెలు మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గొర్రెల మందను ఇంటి వెనుక భాగంలో కంచె వేసి, మలేశాడు. రాత్రి కుక్కలు మూకుమ్మడిగా మందపై దాడి చేయడంతో పది గొర్రెలు మృతి చెందాయి. అలికిడికి రాఘవులు లేచి చూడగా గొర్రెలు చచ్చిపడిఉన్నాయి. లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. గ్రామ పంచాయతీ అధికారులు, పాలకులు కుక్కల బెడదను నివారించాలని అతను కోరాడు.

రేపు గ్రూప్–2పై ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల ప్రయోజనార్థం ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న సదస్సులో సీనియర్ అధ్యాపకులు గ్రూప్–2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్, సమయపాలన తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉచిత అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 91332 37733, 040–35052121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

7 నుంచి లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

పాత గుంటూరు. కొరిటిపాడు ఆంజనేయపేటలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య ఆలయ తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 7 నుంచి 11 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయ్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 7న ఉదయం 6 గంటలకు నెల పొంగళ్లు, విశేష పూజలు, సాయంత్రం 6 గంటలకు స్వామి ఊరేగింపు, 8న ఉదయం 8 గంటలకు గణపతి హోమం, అభిషేకాలు, 9న లక్ష్మీనారాయణ హోమం, విశేష పూజలు, 10న ఉదయం 7 గంటలకు చండీ హోమం, కుంకుమపూజ, 11న ఉదయం 11 గంటలకు అన్నదానం జరుగుతాయని వివరించారు.

వ్యాన్ బోల్తా.. ఒకరికి స్వల్పగాయాలు



రేపల్లె రూరల్: వ్యాన్ బోల్తాపడిన ఘటన పట్టణ శివారులోని గుడ్డికాయ లంక అక్కిలేరు వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన నాగబాబు రేపల్లె పట్టణం నుంచి అడవులదీవి గ్రామానికి ఐస్‌బాక్స్‌లను తన వ్యాన్‌లో తీసుకెళ్తున్నాడు. పట్టణ శివారులోని అక్కిలేరు వద్ద ఎదురుగా వస్తున్న లారీని, మరోవైపు నుంచి వస్తున్న గేదలను తప్పించబోయే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న దిమ్మను ఢీకొని బోల్తా కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ నాగబాబుకు స్వల్పగాయాలు అవ్వగా వ్యాన్ దెబ్బతింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించండి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

తెనాలి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో విద్యార్థి సంఘాల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటించి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని విస్మరించిదని ఆరోపించారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, విమానయానం, బ్యాంకింగ్ వంటి సంస్థలను కూడా ప్రైవేట్ పరం చేసి వ్యవస్థలను కేంద్రం సర్వనాశనం చేసిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి, సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెలా నాసర్జి, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు ఎం.శివకుమార్, కార్యదర్శి బి.రాజేష్, ఉపాధ్యక్షులు వి.దుర్గాప్రసాద్, తిరుమలరావు, సహాయ కార్యదర్శి కుంభ రవితేజ, కోశాధికారి గంటినిపల్లి కోటేశ్వరరావు, మేడికొండ నాగార్జున పాల్గొన్నారు.

నేడు రెయిన్‌బో ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

- ప్రముఖులకు సత్కారం
- 12న ఉచిత మెగా వైద్యశిబిరం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ జీవనలత, ధర్మకుమార్

తెనాలి: పట్టణానికి చెందిన సామాజిక, సాంస్కృతిక సంస్థ రెయిన్‌బో ట్రస్ట్ పదో వార్షికోత్సవం సందర్భంగా మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత తెలిపారు. కార్యక్రమాలను బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోటల్ గౌతమ్ గ్రాండ్ కాన్ఫరెన్సు హాలు నిర్వహించనున్న వేడుకల్లో సీఐడీ అడిషనల్ ఎస్పీ స్నేహిత, బి.రంగనాయకి(నృత్యం), షేక్ షబీనా(లిఫ్టర్), కొండపి వసుంధర(గాత్రం), హైమావతి (సన్నాయి), కాకరపర్తి జగన్మోహిని(మృదంగం), డాక్టర్ అనూరాధ వేజండ్ల(ప్రిన్సిపాల్), డాక్టర్ సత్యశ్రీ(కెమిస్ట్రీ)లను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

12న ఉచిత మెగా వైద్యశిబిరం

వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 12న చెంచుపేటలోని శబరి వృద్ధాశ్రమంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. క్యాన్సర్, క్యాటరాక్ట్ డయాగ్నసిస్, పాప్, డయాబెటిస్, గుండె, ఎముకలకు సంబంధించిన వైద్యనిపుణులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. విలేకరుల సమావేశంలో శబరి వృద్ధాశ్రమం నిర్వాహకులు కొల్లా ధర్మకుమార్, ట్రస్ట్ సభ్యులు కల్యాణి, లక్ష్మి, జ్యోతి, సుధామాధురి, సృజన ఉన్నారు.

రేపు రాష్ట్రంలోని విశిష్ట బ్రాహ్మణ మహిళలకు సత్కారం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పురుషోత్తమశర్మ

తెనాలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ బాధ్యతల్లో ఉంటూనే వివిధ రంగాల్లో రాణిస్తున్న రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ మహిళలకు 'వనితా నీకు వందనం' పేరుతో సత్కరించనున్నారు. బ్రాహ్మణ పరిషత్ తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన స్థానిక మూల్పూరు సుబ్రహ్మణ్యశాస్త్రి కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటలకు జరిగే సభ బ్రోచర్‌ను శుక్రవారం పరిషత్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ ఆవిష్కరించి వివరాలను తెలిపారు. విశాఖపట్టణానికి చెందిన సైకాలజిస్ట్ దుర్వాసుల శర్వాణి ముఖ్యఅతిథిగా, గౌరవఅతిథులుగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, దేవదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విశిష్ట బ్రాహ్మణ మహిళలు అవధానుల హిమగిరి బాల, త్రిపురారిభట్ల సత్యజ్ఞానప్రసూనాంబ, కుప్పం ప్రసూన, వెల్లాల లలితమ్మ, కస్తూరి ఇందిరాదేవి, తీర్థల స్వర్ణలత, ద్వాదశి సుమతి, వలివేటి ఉమా, భాగవతుల లలితా శారద, దూళిపాళ్ల రాజ్యలక్ష్మి, నీలంరాజు సరోజను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో త్రిపురారిభట్ల దత్తు, వంగల మాధవ, చెన్నాప్రగడ శ్రీనివాస్, దావులూరి శ్యాంసుందర్‌శర్మ, సీహెచ్ గోపాలకృష్ణ, ఎం.శేషగిరి, భాగవతుల రామకృష్ణ పాల్గొన్నారు.

జన ఔషధి దివస్



జన ఔషధి దివస్‌లో రామకృష్ణ

తెనాలి: ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన వార్షికోత్సవం 5వ జన ఔషధి దివసు–2023ను శుక్రవారం తెనాలిలో నిర్వహించారు. తెనాలిలోని జన ఔషధి దుకాణంలో నిర్వహించిన కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 1759 రకాల మందులు, 280 సర్జికల్ రకాలు ప్రభుత్వం నిర్దేశించిన అతి తక్కువ ధరకే అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈపర్యాయం స్త్రీ మూర్తుల గౌరవార్థం ఈ ఉత్సవాన్ని జరిపినట్లు చెప్పారు. పద్మావతి, మహిళా సంఘం యానిమేటర్ డి.పద్మావతి, ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆర్.సేవక్రాంతి, కోశాధికారి పద్మావతి, డి.ఏడుకొండలు, నోడల్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు ఖాతాలో జమ



ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన బాధితురాలు

నగరంపాలెం: యాప్ ద్వారా ఓ ఉద్యోగిని లక్షల్లో మోసపోయింది. ఇక డబ్బులు వచ్చే అవకాశాల్లేవని భావించింది. అయితే గతంలో ఓ మహిళ కూడా పది లక్షల రూపాయలకు మోసపోగా, గుంటూరు సైబర్ క్రైం (ఐటీ కోర్)లో ఫిర్యాదు చేశాక, ఆమె ఖాతాలో జమ చేయించారు. ఇదే విషయాన్ని తెలిసిన వారు బాధితురాలి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె ఫిర్యాదు చేయగా, డబ్బులు జమ చేయించారు. గుంటూరు సైబర్ క్రైం (ఐటీ కోర్) పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలిలోని చెంచుపేట వాసి నెలకుర్తి త్రివేణి ప్రభుత్వ ఉద్యోగిని, ఆమె కాటర్పిల్లర్ యాప్‌లో పెట్టుబడులు నిర్వహించేది. ఈ క్రమంలో రెండు నెలలు కిందట రూ.4.75 లక్షలు మోసపోయింది. దీంతో ఆ డబ్బులు వచ్చే అవకాశం లేదని నిర్ణయించుకుంది. ఈలోగా తెలిసిన వారు బాధితురాలికి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఆమె అక్కడ ఫిర్యాదు చేసి, జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్ఐ డి.వెంకటకృష్ణ, ఆయన బృందం ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి వద్ద బ్యాంక్ వివరాలను నమోదు చేసుకుని విచారణ వేగవంతం చేశారు. సంబంధిత బ్యాంక్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో త్రివేణి బ్యాంక్ ఖాతాకు రూ.2,55,200 జమ అయ్యాయి. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆమెకు ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ నగదు అందించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత యాప్‌ల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా బాధితులు ఉన్నట్‌లైతే ఉచిత నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మోసపూరిత యాప్ ద్వారా డబ్బులు పోగొట్టుకున్న తనకు ఇక వచ్చే అవకాశాల్లేవని అనుకున్న సమయంలో తిరిగి ఖాతాలో జమ చేయించడం ఆనందంగా ఉందని త్రివేణి చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి, ఐటీ కోర్ ఎస్ఐ, పోలీస్ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఐటీ కోర్ ఎస్ఐ, పోలీస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంస పత్రాల్ని అందించారు.